


పుష్ప విలాపం


బంతి పూలను డంపింగ్ యార్డులో పడేసిన రైతులు


గుంటూరు రోడ్డ పక్కన వి.కోట పూలను పడేస్తున్న వ్యాపారులు


బంతి పూల తోటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

వి.కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంతి పూలకు కనీస ధర కూడా లేకపోవడంతో రైతులు కోయకుండా తోటపైనే వదిలేస్తున్నారు.రెండు వారాలుగా పూలను కోసి మార్కెట్‌కు తరలిస్తున్నా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో బస్తాను వంద రూపాయలకే కట్టబెట్టి వచ్చేస్తున్నారు.మరీ రెండు రోజులుగా పూర్తిగా పూలను కొనేవారే లేకపోవడంతో స్థానిక వ్యాపారులే కొని ఎగుమతి చేస్తున్నారు. కొన్న ధరలకు ట్రాన్స్‌పోర్టు అదనం కావడంతో ఆ నష్టాలు తమకెందుకని పూలను స్థానిక వ్యాపారులు కూడా కొనడం మానేశారు. కొందరేమో పూలను గుంటూరు మార్కెట్‌కు తరలించినా అక్కడా కొనేవారు ముందుకురాకపోవడంతో పూలను గుంటూరు హైవేపక్కన పడేసి వెనుదిరుగుతున్నారు. శుక్రవారం ఉదయం వి.కోట పూల మార్కెట్‌లో 40 కిలోల బస్తా కేవలం వంద మాత్రమే పలికింది. మధ్యాహ్నం 12 గంటలకైతే కొనేవారే ముందుకు రాకపోవడంతో పూలను తెచ్చిన రైతులు లేక ట్రాక్టర్ పూలలోడ్డును పట్టణంలోని డంపింగ్ యార్డులో పడేసి వెనుదిరిగారు.మరి కొందరు దేవాలయాల వద్ద పడేసి వెళ్ళారు. పూలకు కనీస మద్దతు ధర కూడా పలక్కపోవడంతో నాణ్యమైన దిగుబడులు వచ్చినా కోయకుండా తోటలోనే రైతులు ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారు. మద్దిమాకులపల్లెకు చెందిన వెంకటరమణ రెండెకరాల్లో పూలసాగు చేసి, కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కోతకొచ్చిన తోటకు రోటరి వేసేశారు. ఎకరా పూలసాగుకు రూ. 70 వేల దాకా ఖర్చవుతోంది. కిలో బంతిపూలు రూ. 20 పలికితేనే పెట్టుబడులు తిరిగొస్తాయని, అలాంటిది కొనుగోలే లేకపోతే తమ గతి ఏంకావాలని రైతులు వాపోతున్నారు.

జడ్పీలో పలు క్యాడర్లకు ప్రమోషన్లు

చిత్తూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో వివిధ క్యాడర్లకు ప్రమోషన్లు ఇస్తూ జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 10 మంది రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, నలుగురు ఆఫీస్ సబార్డినేట్లకు టైపిస్టులుగా, ఓ ఆఫీస్ సబార్డినేట్‌కు డ్రైవర్‌గా ప్రమోషన్లు ఇచ్చారు.

డిప్యూటీ కలెక్టర్ మురళి సస్పెన్షన్ కొనసాగింపు

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లోని లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ గత జూలైలో సస్పెండ్ అయిన డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.మురళికి సంబంధించి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ అసైన్డ్ భూములు,నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలో గత జూలైలో మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో అగ్ని ప్రమాదం సంభవించడంతో కీలక ఫైళ్లన్నీ కాలి బూడిదయ్యాయి.ఆ ఘటనలో ఆయన ప్రమేయం ఉందన్న ఆరోపణలతో ప్రభుత్వం అదే నెల 29వ తేదీన సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెన్షన్‌లో ఉండగానే తిరుపతి ఏసీబీ అధికారులు ఇటీవల ఆయనకు చెందిన నివాసాలు, బంధుమిత్రుల నివాసాలు, బినామీల నివాసాల్లో పెద్ద ఎత్తున దాడులు జరిపారు. ఆ సందర్భంగా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారంటూ 06-ఆర్‌సీఏ-టీసీటీ-2024 క్రైమ్ నంబరుతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండుకు ఆదేశించింది. కేసు నమోదై విచారణ చేపట్టిన నేపథ్యంలో మురళి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తిరుపతి విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

25నుంచి డైట్‌లో జానపద నృత్య పోటీలు

వెదురుకుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బల్‌రంగ్ పండుగను పురస్కరించుకుని ఈనెల 25వ తేదీ నుంచి రెండ్రోజులపాటు కార్వేటినగరం 'డైట్'లో జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ శేఖర్ శుక్రవారం తెలిపారు. తప్పెటగుళ్ళు, కర్రసాము, చెంచులవేట, థింసా, జాలరి, బంజారా తదితర మన జిల్లాకు చెందిన జానపద నృత్యాలకు ఆహ్వానమన్నారు. పాల్గొనేవారు 94407 57761 నెంబరుకు తెలియజేస్తే, భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు.


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వరసిద్ధుడి ఆలయానికి రూ.4.44 కోట్ల ఆదాయం

ఐరాల(కాణిపాకం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.4,44,49,759 ఆదాయం లభించినట్లు ఈవో గురుప్రసాద్ తెలియజేశారు. వాహన పూజా సామగ్రి విక్రయించే హక్కును రూ.50,50,000, కొబ్బరి చిప్పల పోగు చేసుకునే హక్కును రూ.45,66,000, కోనేరు వద్ద నేతి దీపాలను విక్రయించే హక్కును రూ.67,00,99, వినాయక సదన్ వద్ద హోటల్ నిర్వహించే హక్కును రూ.27,00,000, చెవి, ముక్కు పోగులు కుట్టు హక్కును రూ.6,50,000, మరగదాంబిక కల్యాణ మండపం వద్ద బంకు నిర్వహణ హక్కును రూ.63,000, మణికంఠేశ్వరాలయం వద్ద బంకు నిర్వహణ హక్కును రూ.6,30,900లకు హెచ్చు పాటదారులు దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్సు వద్ద 24 షాపులకు ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలం ద్వారా రూ.2,40,88,860 ఆదాయం సమకూరింది. ఇందులో షాపు నెంబరు 1కి అత్యధికంగా రూ.1,09,08,000తో రాజారామ్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరింటెండెంట్ బాలరంగస్వామి, కోదండపాణి, క్లర్క్ హేమేశ్వర్‌బాబు, కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను చేపట్టిన నేపథ్యంలో శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి, ఓటర్ల నుంచి దరఖాస్తులను, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.జిల్లాలోని 1776పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అర్జీలను స్వీకరిస్తారన్నారు. తప్పుల సవరణకు, మృతి చెందిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించడానికి, ముసాయిదా జాబితాలో అభ్యంతరాల సవరణకు, నూతన ఓటును పొందడానికి అర్హులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సిట్ సిద్ధం

- తిరుపతి చేరుకున్న బృందాలు
- భూదేవి కాంప్లెక్స్‌లో కార్యాలయం
- కల్తీ నెయ్యిపై నిగ్గు తేల్చనున్న దర్యాప్తు



తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై విచారణకు సుప్రీం కోర్టు నియమించిన సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) బృందానికి సంబంధించిన సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకున్నారు. వారికి అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సులో కార్యాలయం కేటాయించారు. అక్కడ అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటయ్యాక సిట్‌ను నడిపే కీలక అధికారులు రానున్నారు. ఆపై టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చనున్నారు. సిట్ విచారణకు వివిధ అంశాల్లో సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 31 మంది సిబ్బందిని నియమించింది. ఆ సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకుని పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ ఎదుట రిపోర్టు చేసుకున్నారు. అనంతరం సిట్‌కు కార్యాలయం కేటాయించిన భూదేవి కాంప్లెక్సులోని పాత ఎస్వీబీసీ భవనానికి చేరుకున్నారు. అందులో సిట్ బృందానికి అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటవుతున్నాయి. వారం పది రోజుల్లో అవన్నీ పూర్తయ్యాక సిట్ కీలక అధికారులు ఐదుగురు తిరుపతికి రానున్నట్టు సమాచారం. తిరుపతి కేంద్రంగా సిట్ చేపట్టే దర్యాప్తులో సహకరించేందుకు వచ్చిన సహాయక సిబ్బందిలో మదనపల్లె, కర్నూలు, తిరుపతి, ఒంగోలు ప్రాంతాలకు చెందిన నలుగురు డీఎస్పీలు, రాయలసీమ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది సీఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అటెండర్లు వంటి సిబ్బంది 19 మంది ఉన్నారు.

వారం పది రోజుల్లో రానున్న కీలక సభ్యులు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ అనే సంస్థ కల్తీ చేసి సరఫరా చేసిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులను తీవ్ర మనోవేదనకు గురిచేసిన సంగతి తెలిసిందే. లడ్డూ నాణ్యత, రుచి, సువాసన వంటి వాటిపై తరచూ భక్తుల నుంచీ ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీటీడీ ఈవో శ్యామలరావు చొరవ తీసుకుని నెయ్యి నమూనాలను పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ అనుబంధ ల్యాబ్‌కు పంపడం, ఆ పరీక్షల్లో నెయ్యి నాణ్యత దారుణంగా ఉందని, అందులో జంతు కొవ్వు, చేప నూనె వంటి పదార్థాలు కల్తీ చేశారని ల్యాబ్ అనుమానం వ్యక్తం చేయడం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. విచారణలో ఏఆర్ డెయిరీ తమిళనాడులోని దిండిగల్ నుంచీ కాకుండా తిరుపతికి చేరువలోనే ఉన్న వైష్ణవి డెయిరీ నుంచీ నెయ్యి సేకరించి దాన్నే టీటీడీకి సరఫరా చేసినట్టు వెల్లడైన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు గత అక్టోబరు 4వ తేదీన సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ పోలీసు నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు అధికారులతో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను నియమించింది. అప్పటి నుంచి సిట్ విచారణ ఎప్పుడు మొదలవుతుందా? ఆ విచారణలో ఏమి తేలుతుందా? అని దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులు ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సిట్ సహాయక సిబ్బంది తిరుపతి చేరుకోగా వారం పది రోజుల్లో సిట్ కీలక సభ్యులు రానున్నారు. మొత్తం మీద సుప్రీం కోర్టు విచారణకు ఆదేశించిన నెలన్నర తర్వాత ఆ దిశగా కదలిక మొదలైంది. కీలక సభ్యులు వచ్చి విచారణ ప్రారంభిస్తే నెల రోజుల్లోనే ముగించి సుప్రీం కోర్టుకు నివేదిక అందజేసే అవకాశముందని సమాచారం.

బల నిరూపణకు సిద్ధంకండి

తెలుగుదేశం అసంతృప్తులతో నేను మాట్లాడతా

- వైసీపీ కార్పొరేటర్లతో మంత్రి అనగాని
- టీడీపీలో చేరేందుకే సింహభాగం కార్పొరేటర్ల సుముఖత


మంత్రితో సమావేశమైన తిరుపతి కార్పొరేటర్లు

తిరుపతి, నవంబరు22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమవుతోంది. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారు. బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో గురువారం 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు పయనమైన విషయం తెలిసిందే. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీలో ఉండలేమని, టీడీపీలోకి వచ్చేస్తామని మనసులో మాట చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈనెల 28న సీఎం సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు తిరుపతికి వస్తున్నామని, తమ పార్టీలోని అసంతృప్తులతో మాట్లాడతానని అన్నారు. పార్టీ అధిష్ఠాన నిర్ణయం మేరకే జరుగుతుందని చెప్పారు. 29న తిరుపతిలోనే ఉంటామని, పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకోవాలని సూచించినట్టు తెలియవచ్చింది. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడిపోయిన వారి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. రాబోయే పురపాలక ఎన్నికల్లో డివిజన్ల విభజన జరగనుందని, మరో 15 నుంచి 20 డివిజన్లు పెరిగే అవకాశం ఉందని, అందువల్ల కూటమిలో కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకునే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండబోదని మంత్రి చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లతో పాటు కొత్తగా వచ్చేవారితో 24 మంది కార్పొరేటర్లు ఉన్నారని మంత్రికి అన్నా రామచంద్రయ్య చెప్పారు. కాగా ఎక్కువ మంది టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. మంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, సీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య తదితరులు ఉన్నట్టు సమాచారం.

కుప్పానికి సౌర వెలుగులు

- పైలట్ ప్రాజెక్ట్‌గా అమలుకు ఎస్పీడీసీఎల్, రెస్కో కసరత్తు


రెస్కో అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు, రెస్కో ఎండీ సోమశేఖర్ తదితరులు

కుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా సోలరైజేషన్‌ను అమలు చేసే దిశగా ఎస్పీడీసీఎల్, రెస్కో అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. కుప్పం నియోజకవర్గంతోపాటు వి.కోట మండలంలోని కొన్ని పంచాయతీలు కుప్పం రెస్కో పరిధిలోకి వస్తాయి.రెస్కో పరిధిలో 1.3 లక్షల విద్యుత్తు సర్వీసులున్నాయి. యేటా రెస్కో సరఫరా చేస్తున్న విద్యుత్తుకు సంబంధించి సుమారు రూ.6.5 కోట్లు వ్యయమవుతోంది.అయితే విద్యుత్ బిల్లుల బకాయి మొత్తం రూ.1.10 కోట్లకు చేరింది. గృహ విద్యుత్తు బకాయిలు దీనికి అదనం. ఒక్క రెస్కోనే కాదు, అటు ప్రభుత్వం కూడా ఇంత పెద్దమొత్తంలో విద్యుత్తు బిల్లులు చెల్లించలేకపోతోంది.దీనికి ప్రత్నామ్నాయంగా సంప్రదాయేతర విద్యుత్తు సరఫరాపై ప్రణాళిక సిద్ధం చేసింది. కుప్పం డివిజన్‌లో సోలార్ విద్యుత్తు సరఫరాను పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టి, సాధ్యాసాధ్యాలను, లాభనష్టాలను అంచనావేసి తర్వాత రాష్ట్రమంతటా విస్తరించాలనుకుంటోంది. అందుకనే నెల రోజులుగా కుప్పంలో విద్యుత్తు గృహ, ప్రభుత్వ, వ్యవసాయ విద్యుత్తు సర్వీసులపై సర్వే జరిగింది. ఆయా సర్వీసుల పరిధిలో ఎన్ని కిలోమీటర్ల మేర ఎంత ప్రాంతంలో సోలార్ ప్యానెల్స్ అవసరం ఉంటుందో, ఎంత విద్యుత్తు ఉత్పత్తికి అనువైన పరిస్థితులు ఉన్నాయో అంచనా వేసింది. సుమారు 70 వేల గృహ, ప్రభుత్వ కార్యాలయ విద్యుత్తు సర్వీసులకు సోలరైజేషన్ అవసరమవుతుందని అంచనా వేశారు. అలాగే వ్యవసాయ సర్వీసులను కూడా సోలరైజేషన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుపై ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శుక్రవారం రెస్కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెస్కో ఎండీ సోమశేఖర్‌తోపాటు ఏడీఈ మదన్‌మోహన్, ఇతర డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్న ఈ సమీక్షలో పూర్తయిన సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై అమరావతిలో ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగనున్న సమావేశానికి కడా పీడీ వికాస్ మర్మత్‌తోపాటు సీఎండీ సంతోషరావు కూడా హాజరు కానున్నారు. సర్వే వివరాలను వీరు ముఖ్యమంత్రికి,ఉన్నతాధికారులకు సమర్పిస్తారు. ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించి, సోలరైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టనుంది. దీనిపై ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదిస్తే నెల రోజుల్లోనే కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా సోలరైజేషన్ అమలు ప్రారంభం కానుందని చెప్పారు. ఇందువల్ల విద్యుత్తు నష్టాలు తగ్గడంతోపాటు వినియోగదారులే స్వయంగా అదనపు విద్యుత్తును ఎస్పీడీసీఎల్‌కు విక్రయించే అకాశం లభిస్తుందని, తద్వారా వారి విద్యుత్తు బిల్లులు కూడా తగ్గి ఆర్థిక వెసులుబాటు ఏర్పడుతుందని తెలిపారు.

ఓటు వేయని పెద్దిరెడ్డి

- పీఏసీ ఎన్నికల్లో ఓటేసిన సీఎం, జిల్లా ఎమ్మెల్యేలు


పీఏసీ ఎన్నికల్లో ఓటు వేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):అసెంబ్లీలో శుక్రవారం జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేలంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఎన్నికల్లో పోటీకి నామినేషన్ వేసిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం తన ఓటు హక్కును వినియోగించుకోలేదు. పీఏసీ చైర్మన్ పదవిని ఆశించిన పెద్దిరెడ్డి,తొలుత మెంబర్‌గా గెలిచేందుకు గురువారం నామినేషన్ వేశారు. సరిపడా సంఖ్యాబలం లేదని తెలిసీ ఆయన నామినేషన్ వేయడం పట్ల సీనియర్ రాజకీయ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో పెద్దిరెడ్డి ఎమ్మెల్యేగా తన ఓటు హక్కును కూడా వినియోగించుకోకుండా వెనుదిరిగారు. పీఏసీ ఎన్నికల్ని బహిష్కరిస్తున్నట్లు వైసీపీ అధిష్ఠానం ప్రకటించడంతో పెద్దిరెడ్డి ఆ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఎన్నికల్లో జిల్లాకు చెందిన సీఎం చంద్రబాబు సహా మిగిలిన ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, థామస్, మురళీమోహన్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఆయన లోకమే వేరు

పీకల దాకా తాగాడు. మత్తు తలకెక్కింది. నడిరోడ్డులో పడకేశాడు. రద్దీగా ఉండే ఆ మార్గంలో వాహనాలు వచ్చి తొక్కేస్తాయన్న భయం లేదు. ఎందుకంటే ఆయన ఈ లోకంలో లేడు. గురకపెడుతూ నిద్రపోతున్నాడు. ఈ దృశ్యం పుత్తూరు పట్టణం నడిబొడ్డున హెడ్‌మాస్టర్ బావి వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌కు కనిపించింది. వాహనాలు అదుపు తప్పితే చనిపోతాడని భావించిన ఓ మానవతావాది అతన్ని రోడ్డు పక్కకు లాగి పడేశాడు.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

సంకల్ప 'బలం'

కష్టపడి బతకాలన్న సంకల్పం ముందు ఆయన వయస్సు చిన్నబోయింది. చిన్న వయస్సులో ఆసక్తితో రిక్షా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఊహ తెలిశాక దాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. 40ఏళ్లుగా రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు తిరుపతికి చెందిన 60 ఏళ్ల రామదాసు. ఈ వయస్సులోనూ రైల్వేస్టేషన్ నుంచి యాత్రికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాడు. రిక్షా తొక్కడం వల్ల వచ్చిన దాంతో ముగ్గురు కుమార్తెలను చదివించడమేగాక పెళ్లిళ్లు చేసి పంపించాడు. కుమార్తెలు తమవద్దకు రమ్మని చెబుతున్నా ఇన్నాళ్లు దారి చూపిన మార్గాన్ని వదులుకోలేక ఇప్పటికీ రిక్షా తొక్కుతున్నట్లు సంతోషంగా చెబుతున్నాడు.

- తిరుపతి, అర్బన్, ఆంధ్రజ్యోతి





భావరాగయుక్తంగా ఆయన గళం విప్పితే ప్రేక్షకులు తన్మయత్వం చెందుతారు. భక్తితత్వంలో లీనమవుతారు. దివ్యవేదాంతం మొదలు చక్కటి చిక్కటి హాస్యం పండించే తీరుకు పండితులే కాదు పామరులూ మంత్రముగ్ధులవుతారు. ఆయనే హరికథకుడు ఒంటి రవి. నారాయణవనం మండలం తిరువట్యానికి చెందిన ఈయన తండ్రి ఆనందరెడ్డి రంగస్థల కళాకారుడు. తాత మునిసుబ్బారెడ్డి తుంబుర గాయకుడు. కళను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న రవి తెలుగుమీద మమకారంతో తిరుపతి ప్రాచ్యకళాశాలలో చదివారు. తనకు ఇష్టమైన హరికథలో విశారద పట్టా పొందారు. ఎస్వీయూ నుంచి తెలుగులో పీహెచ్‌డీ చేశారు. - పుత్తూరు (ఆంధ్రజ్యోతి)

భళా..భాగవతార్

● రచయితగా..హరి కథకుడిగా రాణిస్తున్న తెలుగు అధ్యాపకుడు రవి

ఆధునిక కాలగమనంలో ఉనికి ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన కళారూపాల్లో ఒకటైన హరికథకు ఊపిరిలూదుతున్న వారిలో రవి ఒకరు. తన కుమారుడు హరికథ నేర్చుకోవాలనేది రవి తండ్రి ఆకాంక్ష. ఈదిశగానే చిన్నప్పటి నుంచి ఆయన హరికథ వైపు మొగ్గు చూపారు. కుప్పంలో హైస్కూలులో తెలుగు పండిట్‌గ కెరీర్ ప్రారంభించారు. 59ఏళ్ల రవి ప్రస్తుతం కార్వేటినగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉద్యోగాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తూ మరోపక్క తాను అమితంగా ఇష్టపడే హరికథనూ ఏనాడూ విస్మరించలేదు. వచనాపాటవం, తెలుగు భాషాభిమానం,సందర్భోచిత హాస్య కుశలత మెండుగా ఉన్న రవి 1986లో నారాణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో రంగస్థల అరంగేట్రం చేశారు. చదువుకునే రోజుల్లో రవీంద్ర భారతి(హైదరాబాద్)లో పార్వతీకల్యాణం హరికథను వినిపించారు. ఆ సందర్భంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు అభినందన ఆయనను ప్రోత్సహించింది. శ్రీకృష్ణ పాండవీయం ప్రదర్శన డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రశంసలందుకుంది. 1996లో అవధాని మేడసాని మోహన్ నిర్వహించిన అపూర్వ పంచ సహస్ర అవధానంలో ఆయనలోని భాషాపటిమను బయటపెట్టింది. ఉత్తమ పృచ్ఛకుడి అవార్డు సొంతం చేసుకోగలిగారు. భారతం, భాగవతం, రామాయణం, శివపురాణాలను ఔపోసన పట్టిన ఆయన భాగవతార్‌గా నలభై ఏళ్లపాటు రాష్ట్రమంతా తిరిగారు. 2500 హరికథలను గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

తెలుగుకు పట్టం

ఉద్యోగ విరమణ చేశాక తెలుగుబాషాభివృద్ధికి మరింత అంకితం కావాలని సంకల్పిస్తున్నాను. వ్యాకరణాంశాలు, పద్యాలు, లేఖారచనలు, ఛందస్సు, అలంకారాలపై పట్టు, గానం చేయడం లాంటి అంశాల్లో ఔత్సాహికులకు ఉచితంగా శిక్షణ ఇస్తాను. భారతం, భాగవతం, రామాయణం లాంటి ఇతి హాసాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. ప్రాథమిక పాఠశాలలో తెలుగుకు పట్టం కట్టాలి.

- ఒంటి రవి

రచయిత కూడా.. : రవి హరికథకుడే కాదు మంచి రచయిత కూడా. 2023 శ్రీసిటీలో ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీవెంకటేశ్వర శతకం, వేదనారాయణ శతకం, అక్షర తపస్మాన్ గీతాలు, భాషా కవితల రచనలు చేశారు. రెండు పెదవులు దగ్గరకు చేరుకుండా పలికే పద్య రచన చేయడం ఆయన విశిష్టత. హావ భావ నటన వైదుష్య, హరికథాసుధానిధి, పండిత కవి వంటి 15 పురస్కారాలను పొందారు. సంగీతసాహిత్యాలతోపాటు అభినయపూర్వకంగా భక్తిని, విజ్ఞానాన్ని,వినోదాన్ని ప్రదర్శించడంతో దిట్టగా పేరు సంపాదించారు.

కొండలా పేరుకున్న చెత్త

● ఐదేళ్లుగా వ్యర్థాల ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం



డంప్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

● సమస్యపై టీటీడీ చైర్మన్ ఫోకస్ ● మూడు నెలల్లో తొలగిస్తాం : ఈవో

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా తిరుమలలో మరో కొండను తలపించేలా చెత్త పేరుకుపోయింది. ఇక్కడి పర్యావరణానికి నష్టం కలిగేలా తయారైంది. పచ్చని చెట్ల మధ్య సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా రోజూ తడిచెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు సేకరిస్తున్నారు. దీనిని గోగర్భం డ్యాం సమీపంలోని డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి, మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్ట్‌లు ఉండే ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. పొడిచెత్తను కూడా వేరు చేసి పునర్వినియోగం చేయదగిన వాటిని తరలించాల్సి ఉంటుంది. గత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి తరలించడంలో కూడా విఫలమాయ్యారు. కంపోస్టు కేంద్రంలో సక్రమ నిర్వహణ జరగలేదు. వచ్చిన చెత్తంతా కుప్పగా పోస్తూ వచ్చారు. దీంతో కొండను తలపించేలా వ్యర్థాలు పోగుబడ్డాయి. ప్రాసెసింగ్ కాంట్రాక్ట్ ఎంపికలోనూ సిఫార్సులు, కమీషన్ల కక్కుర్తి కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని సమాచారం. సాధారణంగా 70 టన్నుల చెత్త వచ్చే ప్రాంతం కనీసం మూడెకరాలైనా ఉండాలి. కానీ తిరుమలలోని డంప్‌యార్డ్ ప్రదేశం ఒకటిన్నర ఎకరా మాత్రమే. ఫలితంగా చెత్త గుట్టలుగా మారిపోయాయి. ఈ క్రమంలోనే టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తొలి ప్రాధాన్యతగా డంప్‌యార్డ్‌పైనే దృష్టిపెట్టారు.

పరిశీలించిన టీటీడీ ఈవో

తిరుమలలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గోగర్భం డ్యాంకు సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. లోపాలను గుర్తించి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. చెత్తను కుప్పగా వే సేందుకు కాంట్రాక్ట్ సంస్థలు ఎందుకంటూ ఆగ్రహించారు. చెత్త విభజనలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఇలా కొనసాగితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై తిరుపతి మున్సిపాలిటీ అధికారులతో చర్చించామన్నారు. భవిష్యత్తులో శాస్త్రీయంగా డంపు చేసే విధానం అమలు చేస్తామన్నారు.



డంప్‌యార్డ్‌లో పేరుకున్న చెత్త



సినిమా చూస్తున్న గల్లా దంపతులు

సనాతన ధర్మం తెలిపే 'దేవకీనందన వాసుదేవ'

మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

తిరుపతి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన మనవడు అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' చిత్రం సనాతన ధర్మాన్ని తెలియజేసేలా ఉందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. గల్లా అశోక్ హీరోగా నటించిన రెండో చిత్రం దేవకీనందన వాసుదేవ సినిమా శుక్రవారం విడుదలైంది. గల్లా అరుణకుమారి, ఆమె భర్త గల్లా రామచంద్రనాయుడు మధ్యాహ్నం కృష్ణతేజ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి తిలకించారు. మనవడి నటన ప్రావీణ్యాన్ని చూసి సంబరపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అశోక్ హీరో కావడానికి చాలా కష్టపడ్డాడని, వెండితెరపై అద్భుతమైన నటనతో మరోసారి నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు చూడదగ్గ సినిమా అన్నారు. అంతకుముందు థియేటర్ వద్ద బాణసంచా పేల్చుతూ అభిమానులు వారికి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, గిరిజ, ఊకా విజయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, మునినాదం, బాబ్జి తదితరులు సినిమా వీక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,803 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,930 మంది తలనీలాలు సమర్పించారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

బీవీఎస్సీ కోర్సులో వందశాతం సీట్లతో భర్తీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నాలుగు బీవీఎస్సీ కాలేజీలు, 22 పాలిటెక్నిక్ కాలేజీలు, ఒక డెయిరీ టెక్నాలజీ కాలేజీల్లో ఖాళీగా ఉన్నట సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. బీవీఎస్సీకి సంబంధించిన 270 సీట్లు ఖాళీగా ఉండగా, 270 మందితో భర్తీ చేశారు. ఈ కోర్సుకు సుమారు 5 వేల మంది దరఖాస్తు చేశారు. అలాగే 10 ప్రభుత్వ, 12 ప్రైవేట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 990 సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. ఈ కోర్సుల్లో 690 మంది విద్యార్థులు చేరారు. డెయిరీ టెక్నాలజీ కాలేజీలో ఖాళీగా ఉన్న 28 సీట్లకు 26 మంది విద్యార్థులు చేరారు. మార్చిలో ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులకు నోటిఫికేషన్ వెలువరించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ) చెంగల్రాయులు తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యం

సత్యవేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళంలో తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన మునిశేఖర్ భార్య హేమావతి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి తన కూతురు చిన్నారి నయనికను తీసుకుని గురువారం ఉదయం వెళ్లింది. రాత్రి ఇంటికి రాలేదు. మునిశేఖర్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తి కళాకారులు

శ్రీకాళహస్తి, నవంబరు 22: ఢిల్లీలో శుక్రవారం ప్రారంభమైన ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు కళాకారులు పాల్గొంటున్నారు. కొయ్యబొమ్మల కళాకారుడు గుమ్మడిపూడి దశరథాచారి, కలంకారి కళాకారుడు సుధీర్‌లకు అవకాశం లభించింది. తోలుబొమ్మల కళాకారుడు కుళ్లాయప్పకు అవకాశం దక్కింది. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్ మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. కేంద్ర జౌళి శాఖ మంత్రి పవిత్రా మార్గరీటా శుక్రవారం దీన్ని ప్రారంభించారు. కొయ్యబొమ్మలు, కలంకారీ కళా ఉత్పత్తుల స్టాల్స్ ఇందులో ఏర్పాటు చేశారు. దేశ, విదేశీ కళాప్రియులు వీటిని సందర్శిస్తున్నారు. నిమ్మలకుంటకు చెందిన తోలుబొమ్మల కళాకారుడు కుళ్లాయప్ప కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.



ఢిల్లీ ప్రదర్శనలో సందర్శకులతో శ్రీకాళహస్తికి చెందిన హస్తకళాకారుడు గుమ్మడి దశరథాచారి

లెక్క తేలుతోంది..!

● 34 అపార్టుమెంట్లకు పన్నుల తగ్గింపు
● ఇష్టారాజ్యంగా టెండర్ల ప్రక్రియ

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలను వెలికితీసే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని ప్రాథమికంగా విచారణ కమిటీ గుర్తించింది. ఇదివరకు ఆడిట్ కమిటీ నిగ్గుతేల్చిన అంశాలే విచారణ కమిటీకి బ్రహ్మాస్త్రంగా మారినట్టు తెలుస్తోంది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) విచారణకు సిద్ధమయ్యారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. వారం రోజులుగా కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌తో పాటు అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబులపై లోతైన విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారంతో విచారణ పూర్తిచేసుకుని మరో వారంలో నివేదిక సిద్ధ చేసేపనిలో విచారణ బృందం కసరత్తు చేస్తోంది. .రెవెన్యూ, పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించారు. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం, లేని అధికారులు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ గుర్తించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డులో నమోదు చేసిన వాటికి చాలా వ్యత్యాసం ఉన్నట్టు సమాచారం. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు తెలిసింది. దాదాపు 34 అపార్టుమెంట్లను పరిశీలిస్తే 250కు ఫ్లాట్లకు ఇష్టారాజ్యంగా పన్నులు తగ్గించి వేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలోనూ గత డీజీ విజయకుమార్ రెడ్డిపై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు కార్పొరేషన్ కార్యాలయం నుంచి పలు రికార్డులు తెప్పించుకుని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చేయని పనులకు కూడా చేసినట్టు చూపించారని, కోట్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం

తిరుచానూరు, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈనెల 27న ఆలయంలో లక్ష కుంకుమార్చన జరగనుంది. 28న జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ఈ వేడుకలకు సంబంధించిన పనులను టీటీడీ అధికారులు వేగవంతం చేశారు.

వాహన సేవలు ఇలా..

28వ తేదీ: ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్నశేష వాహనం
29 : ఉదయం పెద్దశేషవాహనం, రాత్రి హంస వాహనం
30 : ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం
డిసెంబరు 1 : ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం
2: ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం వసంతోత్సవం
3: ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గరుడ వాహనం
4: ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం
5: ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం
6: మధ్యాహ్నం పంచమీతీర్థం, రాత్రి ధ్వజావరోహణం
7: సాయంత్రం పుష్పయాగం.

సేవాభావంతో రైతులకు సేవలందించండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది రైతులకు సేవాభావంతో సేవలందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు హెచ్చరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. రబీలో ఈ-పంట నమోదులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సాంకేతికత అధికారి హరిత వివరించారు. పంట, బీమా, పీఎం కిసాన్ గురించి సరళ, గాయత్రి సిబ్బందికి వివరించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ వివరించారు. వరి సాగులో పరిమితంగా రసాయనాల వినియోగంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధిపతి డాక్టర్ మురళీకృష్ణ రైతులకి శిక్షణ ఇచ్చారు. సిబ్బందితోపాటూ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కళాశాల ఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు వేణుగోపాలరావు, శ్రీనివాస్, శశికళ పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ

సంస్కృత వర్సిటీలో డ్రగ్స్ కలకలం!

● ఒడిశాకు చెందిన ఓ విద్యార్థిపై అనుమానం
● కూపీ లాగుతున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగింది. వర్సిటీ గరుడాచలం హాస్టల్లోని ఓ గదిలో డ్రగ్స్ ఉన్నాయంటూ వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు గణేష్ నేతృత్వంలో నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తిని డిమాండ్ చేశారు. దీనిపై వర్సిటీ అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే పోలీసులు ప్రాథమిక వివరాలను కొంతవరకు సేకరించినట్టు తెలుస్తోంది.వర్సిటీలోని గరుడాచల హాస్టల్లో ఒడిశాకు చెందిన ఓ ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థి వద్ద 20 డ్రగ్స్ ప్యాకెట్లు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న మరో విద్యార్థికి 14 ప్యాకెట్లను అందజేసినట్లు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులకు వాటిని అందజేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏబీవీపీ నేత గణేష్ ఈ మేరకు ఆరోపించారు.యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగడంతో యూనివర్సిటీ డ్రగ్స్ కమిటీ అత్యవసరంగా సమావేశమైంది. అసలు ఏం జరిగిందంటూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ తదితరులు డ్రగ్స్ కమిటీ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోపణలు వస్తున్న హాస్టల్ సిబ్బంది, విద్యార్థులను విచారించినట్లు చెప్పారు. చీఫ్ వార్డెన్‌ను పిలిపించి మాట్లాడారు. అంతా అబద్ధమని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ కొట్టి పారేశారు. డాగ్ స్క్వాడ్ ద్వారా విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్‌లో 22 కేజీల డ్రగ్స్ ప్యాకెట్లు డాగ్ స్క్వాడ్ ద్వారా దొరకడంతో ఇదే తరహాలో తనిఖీ చేయించాలనే అభిప్రాయం వినిపిస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో డ్రగ్స్ అనవాళ్లు లేకుండా చేయవచ్చని యూనివర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన జాగృతి యాత్ర బృంద సభ్యులు 500 మంది శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఇందులో అమెరికా, యూరప్‌కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు. బృంద సభ్యులు రోల్ మోడల్‌గా ఎంచుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు రవీంద్ర సన్నారెడ్డి వివరణ ఇస్తూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తాము ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు డైకిన్, హ్యావెల్స్, ఈప్యాక్, బాల్ కార్పొరేషన్, థెర్మాక్స్, మెక్‌విన్, జెడ్‌టీటీ, ఎంఎండీ, ఏఎల్ఎఫ్ ఇండియా, బెర్గిన్ ఫైప్స్, ఆర్ఎస్‌టీ ట్రాన్స్‌మిషన్స్, బ్రేక్స్ ఇండియా పరిశ్రమలను సందర్శించారు.



గ్రానైట్ ఫర్నిచర్



ఫర్నిచర్ దేంతో చేస్తారు? చెక్కతో చేస్తారు లేదా కృత్రిమంగా తయారు చేస్తున్న చెక్కపలకలతో తయారు చేస్తారు. చిత్తూరు నగరంలోని శ్రీనివాస్ మాత్రం గ్రానైట్‌తో ఫర్నిచర్ తయారు చేసి అబ్బురపరుస్తున్నారు. ఇళ్లలో ఫ్లోరింగ్‌కీ, కిచెన్‌లో బండలుగా వాడే గ్రానైట్..ఈయన చేతిలో చిత్రవిచిత్రమైన రూపాలు పోసుకుంటోంది.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

చిత్తూరు నగరంలోని కాజూరుకు చెందిన శ్రీనివాస్ 20 ఏళ్లుగా గ్రానైట్‌తో వివిధ రకాల ఫర్నిచర్ తయారు చేస్తున్నారు. ఈయన చేసిన ఫర్నిచర్‌ను కొందరు బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి నగరాలకు చెందిన వ్యాపారులు హోల్‌సేల్‌గా కొని రీటైల్‌గా విక్రయిస్తుంటారు. బ్లాక్, బ్రౌన్, వైట్ వంటి రంగుల్లోని గ్రానైట్ పలకలతో ఫ్లవర్ స్టాండ్, బృందావనం (తులసి కోట), టీపాయ్, ఫోన్ స్టాండ్, డైనింగ్ టేబుల్, సిటింగ్ చైర్ వంటివి పలు డిజైన్లలో తయారు చేస్తుంటారు. తిరుపతి - బెంగళూరు హైవే రోడ్డులోని ఇరువారం బ్రిడ్జి పక్కన దుకాణం ఏర్పాటు చేసుకుని ఇతను ఒక్కడే ఈ ఫర్నిచర్ తయారు చేస్తుంటారు. నగరవాసులతోపాటు, బెంగళూరు, చెన్నై, తిరుపతి వెళ్లే ప్రయాణికులు కూడా ఈయన వద్ద ఫర్నిచర్ కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో కంప్యూటర్‌ను వినియోగించి, డిజైన్లు సెట్ చేసి గ్రానైట్‌ను లేజర్ మెషిన్లతో కట్‌చేసి, ఫర్నిచర్ తయారు చేస్తుంటారు. కానీ శ్రీనివాస్ మాత్రం తన సొంత ఆలోచనలను ఉపయోగించి.. ఓ గ్రానైట్ కటింగ్ మెషిన్, గ్రైండింగ్ మెషిన్, మెటల్ పేస్ట్, ఎరాల్డైట్ వినియోగించి అందమైన ఫర్నిచర్ తయారు చేయడం ప్రత్యేకత.



గ్రానైట్‌తో ఫర్నిచర్ తయారు చేస్తున్న శ్రీనివాస్







వివిధ రకాల ఫర్నిచర్



తులసికోట

కస్టమర్లు కోరిన డిజైన్‌లోనూ..

కస్టమర్లకు ఆర్డర్లపైనా ఫర్నిచర్ చేసిస్తారు శ్రీనివాస్. ప్రధానంగా వారు కోరిన డిజైన్లలోనూ తయారు చేస్తారు.

జిల్లా అంతటా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తాం

● ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు



చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయానికి భవనాన్ని పరిశీలిస్తున్న సంతోషరావు

చిత్తూరురూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. శుక్రవారం చిత్తూరు ఎస్ఈ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ పరికరాల కారణంగా విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. మరోవైపు విద్యుత్ ధరలు కూడా పెరిగాయని, దీన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని వాడేవిధంగా శ్రీకారం చుట్టిందన్నారు.ఈ క్రమంలో పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నియోజకవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. కుప్పంలో 75వేల సర్వీసులుంటే అందులో మొదటి విడతగా 50వేల సర్వీసులకు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆ తర్వాత జిల్లా అంతటా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సోలార్ ప్యానళ్లు అమర్చుతామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను వ్యవసాయ సర్వీసులకు మినహాయించి.. అన్నింటికీ అమర్చడం జరుగుతుందన్నారు.

ఈఈ కార్యాలయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

జిల్లా విభజన తర్వాత చిత్తూరుకు ఇటీవలే ప్రభుత్వం నూతన ఎస్ఈని కేటాయించింది కానీ.. కార్యాలయం ఏర్పాటుకు భవనం లేకపోవడంతో చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ కార్యాలయాన్ని ఎస్ఈ కార్యాలయంగా మార్చారు. ఈఈ కార్యాలయానికి భవనం కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గిరింపేటలోని పాత కలెక్టరేట్‌లో ఓ భవనాన్ని కేటాయించారు. దీన్ని శుక్రవారం సీఎండీ పరిశీలించారు. మరమ్మతులకు సుమారు రూ.7 లక్షలను మంజూరు చేశారు. త్వరలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీజీఎం అయూబ్‌ఖాన్, ఈఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ఆనంద్, ప్రసాద్, జగదీష్, వాసుదేవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో ముసుగు దొంగల హల్‌చల్



పొలంలో పడేసిన హుండీ

శ్రీరంగరాజపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలో ముసుగు దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం ఒడ్డుపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ టీచర్ ఇంటి బీగాలు పగులగొట్టిన ముసుగు దొంగలు చోరీకి యత్నించారు. శబ్దానికి మెలకువ వచ్చిన ఆ టీచర్ కేకలు వేయడంతో పరారయ్యారు. అనంతరం సమీపంలో ఉన్న గంగమ్మగుడిలోని తయ్యూరు పాయకట్టు ఆరిమాని గంగమ్మ పెద్ద హుండీని ఎత్తుకెళ్లారు. అందులోని డబ్బులను తీసుకుని హుండీని గుడి పక్కనే ఉన్న పొలంలో పడేసి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.





క్రీడాకారులతో ఎస్పీ, నిర్వాహకులు - సాఫ్ట్‌బాల్ ఆడుతున్న ఎస్పీ మణికంఠ

అరగొండలో సాఫ్ట్‌బాల్ సందడి



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికలు

తవణంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. కొంతసేపు సాఫ్ట్ బాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి రోజు పోటీలు, విజేతలను ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ భారతి, డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుధాకర్, సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ చిరంజీవి, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలిలా..

బాలికల విభాగంలో.. ప్రకాశం జిల్లాపై కృష్ణా, కృష్ణాపై కడప జిల్లా, విశాఖపట్నంపై చిత్తూరు జిల్లా, ప్రకాశంపై కడప జిల్లా జట్టు విజయం సాధించింది.

● బాలుర విభాగంలో.. శ్రీకాకుళం జిల్లాపై గుంటూరు, వెస్ట్ గోదావరిపై కర్నూలు జట్టు విజయం సాధించాయి.

కలెక్టర్‌ను కలిసిన మెప్మా పీడీ



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న రవీంద్ర

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా పీడీగా నియమితులైన డాక్టర్ రవీంద్ర శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఇక్కడ పీడీగా కొనసాగిన రాధమ్మను ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు, అక్కడ పీడీగా ఉన్న రవీంద్రను మన జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

మామ హత్య కేసులో అల్లుడికి జీవిత ఖైదు

సోమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మామను హత్య చేసిన అల్లుడికి జీవిత ఖైదు విధిస్తూ మదనపల్లె 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పు చెప్పింది. ఎస్ఐ శివశంకర వెల్లడించిన వివరాల మేరకు... సోమల మండలం నెల్లిమంద పంచాయతీ గొల్లపల్లెకు చెందిన పలగాని వెంకటసిద్దులు(63)కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్దకుమార్తె సిద్ధరత్నకు కలికిరి మండలం గుట్టపాళెం పంచాయతీ గొల్లపల్లెకు చెందిన సుధాకర్‌తో వివాహం జరిపారు. కొద్ది కాలం తరువాత సుధాకర్ తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. తన మామ వెంకటసిద్దులు చేతబడితోనే తన తండ్రి చనిపోయాడని సుధాకర్ నమ్మడంతో తరచూ వివాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలోనే 2017 ఆగస్టు 6వ తేదీన పొలం వద్దకు మామ వెంకటసిద్దులుతో కలసి వెళ్లిన సుధాకర్ కొడవలితో హత్య చేసి పరారయ్యాడు. వెంకటసిద్దులు కుమారుడు నాగరాజ ఇచ్చిన ఫిర్యాదుతో సోమల పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సుధాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.మదనపల్లె 2వ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి అబ్రహాం శుక్రవారం సుధాకర్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.3 వేల జరిమానా విధించారు. సదరు కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు కృషి చేసిన అప్పటి సీఐ రవీంద్ర, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ప్రస్తుత సీఐ రాంభూపాల్, ఎస్ఐ శివశంకర, సాక్షులను హాజరు పరచిన కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌ను ఎస్పీ మణికంఠ అభినందించారు.

ఎస్ఆర్‌పురంలో మహిళా డిగ్రీ కళాశాలకు మంత్రి లోకేశ్ గ్రీన్‌సిగ్నల్

వెదురుకుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చొరవతో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరు కానుంది. ఎస్ఆర్‌పురంలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని మంత్రి లోకేశ్ దృష్టికి థామస్ తీసుకెళ్లారు. దీంతో డిగ్రీ కళాశాల తాత్కాలిక నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు శాశ్వత భవన నిర్మాణాలకు కావలసిన స్థల సేకరణ తదితర అంశాలను చూడాలని లోకేశ్ సూచించారు.

డీపీవో బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సుధాకర్‌రావు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా నియమితులైన సుధాకర్‌రావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో వందశాతం స్వచ్ఛతా కార్యక్రమాలు అమలు చేయడంతోపాటు, ఇళ్ల పన్నుల సేకరణపై దృష్టి సారించాలని డీపీవోను కలెక్టర్ ఆదేశించారు. అలాగే జేసీ విద్యాధరిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఐరాల, రేణిగుంట, వడమాలపేట, వెదురుకుప్పంలో ఎంపీడీవోగా పనిచేశారు. డీఎల్‌డీవోగా అన్నమయ్య జిల్లాలో పనిచేస్తూ పదోన్నతి పొంది మన జిల్లాకు డీపీవోగా వచ్చారు.

వీఆర్వోకు దేహశుద్ధి

పెళ్లి చేసుకుంటానని కాలయాపన చేయడంతో దాడి

రామకుప్పం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాటి వీఆర్వోను ఏళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని కాలయాపన చేస్తుండడంపై ఆమె బంధువులు శుక్రవారం వీఆర్వోకు దేహశుద్ధి చేసిన ఘటన రామకుప్పంలో జరిగింది. బాధితురాలి బంధువుల కథనం మేరకు..కడప జిల్లాకు చెందిన శ్రవణ్ రామకుప్పం మండలం కొంగనపల్లె వీఆర్వోగా, రామకుప్పం మండలం గిడ్డపల్లెకు చెందిన కృపావాణి బందార్లపల్లె సచివాలయ వీఆర్వోగా పని చేస్తున్నారు. వీరిద్దరు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.అయితే పెళ్లి చేసుకోడంపై శ్రవణ్ దాటవేత ధోరణి ప్రదర్శిస్తుండడంతో కృపావాణితో పాటు ఆమె బంధువులు శుక్రవారం తహశీల్దారు కార్యాలయం వద్ద శ్రవణ్‌ను నిలదీశారు.సరైన సమాధానం రాకపోవడంతో దేహశుద్ధిచేశారు. అనంతరం వారు పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వారిని స్టేషనుకు పిలిపించి విచారించారు. శ్రవణ్‌ను స్టేషనుకు రప్పించేందుకు పోలీసులు ఫోన్ ద్వారా ప్రయత్నించగా అతని నుంచి స్పందన కరవైంది. శనివారం తహశీల్దారుతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు చెప్పడంతో కృపావాణి బంధువులు ఇంటిముఖం పట్టారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించండి

తిరుపతి(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు తక్షణం ఫీజు చెల్లించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ సూచించారు. ఫీజు చెల్లించేందుకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందని, ఇప్పటికీ జిల్లాలో 14,916 మంది ఫీజులు చెల్లించలేదని వెల్లడించారు. ఫీజుల చెల్లింపులో 49 పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

బడి వేళల్లో మార్పులు మొదలు

● మండలానికి ఒక హైస్కూల్ ఎంపిక



పెంచిన బడి పనివేళలు అమలు చేసేందుకు ఎంపికైన చిత్తూరు గిరింపేటలోని నగరపాలక ఉన్నత పాఠశాల

చిత్తూరు సెంట్రల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను పెంచడం కోసమంటూ బడి వేళల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి.మండలానికి ఒక హైస్కూల్లో ఈనెల 30వ తేదీ వరకు కొత్త వేళలను కొనసాగించి లాభనష్టాలను నివేదిక రూపంలో ఎంఈవోల ద్వారా జిల్లా విద్యాశాఖ నుంచి రాష్ట్ర పాఠశాల విద్యకు పంపాల్సి ఉంది. మండలంలో బడి పనివేళలు పెంచే పాఠశాలను ఎంఈవోలు ఎంపిక చేశారు.ఇలా 31 పాఠశాలలను ఎంపిక చేసిన విద్యాశాఖ అధికారులు శుక్రవారం నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమయాన్ని 5 గంటల వరకు పొడిగించారు. అయితే దీనిపై ఉపాధ్యాయ సంఘాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బడి పనివేళలు పెంచడం ద్వారా బడి దూరాన్నివిద్యార్థుల ప్రయాణ సమయాన్ని, ఇందులో చేసుకునే పరిణామాలను పునఃపరిశీలించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఆటల సమయం పెంచడంతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు అదనపు సమయం ఉపయోగపడుతుందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

ఆరు గంటలే ఉండాలి



నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్-2023, జాతీయ నూతన విద్యా విధానం-2020 అనుసరించి రోజుకు విద్యార్థులకు బోధన సమయం 6 గంటలు మాత్రమే ఉండాలి.బడి పని వేళలు పెంచడం ద్వారా విద్యార్థులపై ఒత్తిడి పెరగడం మంచిది కాదు.ఈ విషయంలో విద్యార్థుల, తల్లిదండ్రుల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలి.

- కన్నన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్టీయూ

దూరం వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు



బడి పనివేళలు పెంచడం ద్వారా దూర, గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాకపోకల, ప్రయాణ సమయాలను సైతం విద్యాశాఖ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది.

- జయప్రకాష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు, నోబుల్ టీచర్స్ అసోషియేషన్

ఇళ్ల మధ్య మద్యం దుకాణం తొలగించాలి



మద్యం దుకాణం వద్ద మహిళల ఆందోళన

రొంపిచెర్ల, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ సర్వర్ పేటలో ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం తొలగించాలని శుక్రవారం మహిళలు ఆందోళన చేపట్టారు. మండలానికి రెండు మద్యం దుకాణాలు మంజూరు కాగా ఒకటి గ్రామానికి దూరంగా పెట్టారని, మరొకటి సర్వర్‌పేటలో ఇళ్ల మధ్యలో పెట్టారని, దీంతో అల్లరి మూకలు మద్యం సేవించి బాటిల్స్, వ్యర్థాలు తమ ఇళ్ల పరిసరాల్లో వేస్తున్నారన్నారు. దుకాణాన్ని మరొక చోటుకు మార్చుకోవాలని తెలిపారు. అధికారులతో సంప్రదించి తగు చర్యలు తీసుకొంటామని ఏఎస్ఐ మధు మహిళలను సర్దిచెప్పారు.

కుటుంబ బంధాల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి):కుటుంబ బంధాలు, అనుబంధాలు గురించి మాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం గురించి మతి భ్రమించి మాట్లాడడం సరికాదన్నారు. జగన్ చేసిన అన్యాయం గురించి ఆయన చెల్లి, తల్లి ఇద్దరూ మీడియా ముందు బహిర్గతంగా మాట్లాడింది నిజము కాదా అని ప్రశ్నించారు. అలా ఏనాడైన చంద్రబాబు కుటుంబం మాట్లాడినట్లు నిరూపించగలరా అని సవాలు విసిరారు. తండ్రి శవాన్ని అడ్డం పెట్టుకొని శవ రాజకీయాలు చేసింది ఎవరనేది ప్రజలకు తెలుసన్నారు. అలాంటి నీవు మా అధినేతను విమర్శించడమా అని అన్నారు. వీలైతే శాసనసభకు వెళ్లి ప్రజల సమస్యలపైన మాట్లాడి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



వార్షిక క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు

శాంతిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూతేగానిపల్లె పరమహంస యోగానంద విద్యాలయంలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మాజీ ఎంపీపీ ఉదయకుమార్ నాయుడు,మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, సర్పంచ్ మంజునాథరెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ పార్థవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలొస్తే వైసీపీదే అధికారం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి



మాట్లాడుతున్న కరుణాకర రెడ్డి

గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించి దగా చేస్తున్న టీడీపీ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగవరంలోని పలమనేరు నియోజకవర్గ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కరుణాకర రెడ్డి మాట్లాడుతూ 2027లో జరగబోయే జమిలి ఎన్నికలలో మరోసారి వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని స్పష్టం చేశారు. మాజీ మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ అడ్డబిడ్డలకు రక్షణగా ఉంటామన్న పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చాక ఎన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా నోరు మెదపలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి అన్యాయాన్ని ఎదురిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ, కృష్ణమూర్తి, ప్రహ్లాద, బాలాజీనాయుడు, యువరాజ్, చెంగారెడ్డి, కేశవులు, హేమంత్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

కుప్పం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 11వ క్లస్టర్ కొత్తపేటలో శుక్రవారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ప్రతిఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకుని, తద్వారా చేకూరే ప్రయోజనాలు పొందాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.గోపీనాథ్, కన్నన్, యూనిట్ ఇన్‌ఛార్జి అప్పు ముఖేశ్, శివ పాల్గొన్నారు.

సోమల : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. శుక్రవారం కామిరెడ్డివారిపల్లె పంచాయతీలో సభ్యత్వ నమోదును పరిశీలించారు. ప్రతి టీడీపీ కార్యకర్త ఈనెలాఖరులోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు.

వీఆర్ఏల సంఘం ఉపాధ్యక్షుడిగా ఇర్ఫాన్

రొంపిచెర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రొంపిచెర్లకు చెందిన ఇర్ఫాన్ ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఇర్ఫాన్ అన్నారు.

రైతుల సంక్షేమాభివృద్ధికి మినీ గోకులం షెడ్ల నిర్మాణం

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్



పులిచెర్లలో గోకులం షెడ్డు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుడిని సన్మానిస్తున్న జేడీ ప్రభాకర్

కల్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి మినీ గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మినీ గోకులం షెడ్ల లబ్ధిదారులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు జేడీ ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు షెడ్లు నిర్మాణ పనులు చేపట్టాలని, పనులు నాణ్యతగా ఉండేలా సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. షెడ్లలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఫ్యాన్లు తప్పనిసరిగా అమర్చాలని తెలిపారు. మండలంలో మినీ గోకులం షెడ్డు నిర్మాణం పూర్తి చేసిన మొదటి లబ్ధిదారుడు రామనాథంనాయుడును సన్మానించారు. అనంతరం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లిలో పూర్తి చేసిన మినీ గోకులం షెడ్డును జేడీ పరిశీలించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ షౌకత్, పశువైద్యాధికారులు చందనప్రియ, మునిచంద్ర, తబ్రీద్ బాషా, శ్రీహరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల : పాడి రైతులకు 90శాతం రాయితీలో ఇచ్చిన గోకులం షెడ్లు సకాలంలో పూర్తిచేయాలని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, ఏపీడీ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గోకులాలు మంజూరైన రైతులతో సమావేశం జరిగింది. పశువైద్యాధికారి డాక్టరు శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో 86 గోకులాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన రెడ్డి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్స్, రైతులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

సోమల : గోకులం షెడ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని సోమల పశుసంవర్ధకశాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలానికి 50 గోకులాలు మంజూరైనా నిర్మాణాలు నత్తనడకన సాగడంపై అవగాహన కల్పించారు. షెడ్ నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వకపోవడంతో పనులు ప్రారంభించలేకపోయామని పలువురు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణ, పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, ఏపీవో దినకర్‌బాబు, జేఈ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధికి ఫైవ్‌మెన్ కమిటీ : చల్లా



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలో పార్టీ పటిష్టత, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడానికి ఐదుగురు నాయకులతో ఫైవ్‌మెన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ టీడీపీ ముఖ్యనేతలతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు చాలా వెనుకబడిందని, శ్రేణుల సమన్వయంతో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు, అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకునేలా కమిటీ వ్యవహరిస్తుందన్నారు. కమిటీ సభ్యులుగా మున్సిపల్ కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, మాజీ కౌన్సిలర్ దేశాదిప్రకాశ్, మైనార్టీ నాయకుడు ఎస్.సుహేల్‌బాషాలను నియమించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలో టీడీపీ పటిష్టత, అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

అడవి పందులతో పంటలకు అపార నష్టం



అడవి పందుల సంచారంతో ధ్వంసమైన వరి పైరు

సోమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో అడవిపందులు వరి పైర్లలో తిరగడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. పేటూరు పంచాయతీ కనికల చెరువు సమీపంలోని వరి పొలాలపై గురువారం రాత్రి అడవి పందులు దాడులు చేసి తిన్నంతగా తిని, కోతకు వచ్చిన పంటను తొక్కి ధ్వంసం చేశాయి. సమీప మామిడి తోటల్లో విచ్చలవిడిగా తిరిగి కూరగాయల తోటలను నాశనం చేసినట్లు బాధిత రైతులు వాపోయారు. సోమల మండలంలోని గట్టువారిపల్లె, శీలంవారిపల్లె, గురికానిపల్లె, ఇర్లపల్లె, పత్రపల్లె, రాంపల్లె ప్రాంతాల్లో వరి కోతలు చేయాల్సి ఉండగా అడవిలోని వన్యప్రాణులు సంచారంతో రైతులు పొలాల వద్ద నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు.

వడ్డిపల్లె సమీపంలో ఏనుగుల సంచారం



సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లె సమీప వరిపొలాల్లో జంట ఏనుగులు సంచరించినట్లు రైతులు తెలిపారు. గురువారం రాత్రి ఇడగట్టు రెడ్డెప్ప, ఇడగట్టు హరినాథ్, డేరంగుల దేవేంద్రలకు చెందిన పొలాల్లోని కోతలకు సిద్దంగా ఉన్న వరి పైర్లను తొక్కివేసి తీవ్ర నష్టం చేశాయి.

26న ధర్నాను జయప్రదం చేయండి

పలమనేరు, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న చేపడుతున్న కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు సీఐటీయూ కార్యాలయం ముందు ధర్నా కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూలంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంటుతో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేటర్లకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు గిరిధరగుప్తా, వరలక్ష్మి, పుష్ప, గాయత్రి, మంగమ్మ, సుజాత పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ నీటి సరఫరా

శాంతిపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఇన్ లైన్ క్లోరినేషన్ ద్వారా గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ అన్నారు. శుక్రవారం దండికుప్పం పంచాయతీ కృష్ణేపల్లెలో నూతనంగా వేసిన బోరుకు ఇన్ లైన్ క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాటు చేసి సింథటిక్ ట్యాంకుకు పంపింగ్ చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించారు. ఈవోపీఆర్‌డీ రవినాయక్, సర్పంచ్ చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమిస్తాం

పలమనేరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి) : ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పలమనేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలతో విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అధికభారాన్ని మోపడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికే అనేక పన్నుల రూపంలో ప్రజలు అతలాకుతలమవుతున్నారని, ఇటువంటి సమయంలో కూడా ప్రభుత్వం విద్యుత్ చార్జీల మోత మోగించాలని భావించడం దుర్మార్గమన్నారు. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు మళ్లీ సర్దుబాటు పేరుతో చార్జీలు కట్టాలని చెప్పడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు చెన్నకేశవులు, బుర్రమంజునాథ్, గుర్రప్ప, కే.రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో వివాహిత మృతి

రామకుప్పం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : వాటర్ హీటర్‌ను ఆన్ చేసిన ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు ...రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామానికి చెందిన వివాహిత నాగరత్నమ్మ(47) గురువారం రాత్రి ఇంట్లో వాటర్ హీటర్ ఆన్ చేసింది. ఆ సమయంలో ఆమె విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం తరలించారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ

బైరెడ్డిపల్లె, నవంబరు22(ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే శుక్రవారం మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఐఈసీ జిల్లా కన్సల్టెంట్ శాంతి మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల వ్యాధులు ప్రబలుతాయని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాధం, పాఠశాలల హెచ్‌ఎంలు గౌహర్‌సుల్తానా, తోయజాక్షి, ఎంఈవో సురేష్‌బాబు, కార్యదర్శి సదాశివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళను మోసగించిన కేసులో నిందితుడి అరెస్టు

వి.కోట, నవంబరు, 22(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం రామనాథపురానికి చెందిన ఎస్టీ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహం చేసుకోకుండా నిరాకరించిన ఘటనలో దినేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ డి.ప్రభాకర్ తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ అట్రాసిటీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. తనను నమ్మించి ఆపై వివాహం చేసుకోకుండా వేరే మహిళను పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడు సతీష్ అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఆయన వెంట సీఐ సోమశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాపిరెడ్డిగారిపల్లి వద్ద పంటలపై ఏనుగుల దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లు, టమోటా పంటలు

కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి వద్ద మామిడి, టమోటా, వంకాయ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు గురప్పకు చెందిన టమోటా, వంకాయ పంటలను ఏనుగుల గుంపు తొక్కేశాయి. మామిడిచెట్లను విరిచేశాయి. మరో రైతు సుబ్రమణ్యంకు చెందిన టమోటా, వంకాయ చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. సమీపంలోని శ్రీధర్‌కు చెందిన వంకాయ, టమోటా పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు కొబ్బరి, మామిడి చెట్లను విరిచేశాయి. బోరు మోటర్‌ను, డ్రిప్ పైపులను ధ్వంసం చేసిన ఏనుగులు శుక్రవారం ఉదయం వరకు అదే పొలాల్లోనే ఉండటంతో పంటలకు మరింత నష్టం వాటిల్లింది. ఉదయం మూలమడుగు అడవివైపు ఏనుగుల గుంపు వెళ్లినట్లు ఎఫ్‌బీఓ మున్నా తెలిపారు. ధ్వంసమైన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

ప్రతి రైతుకూ ఉపాధి పనులు

సోమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి రైతుకూ పనులు కల్పిస్తామని ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పొదలకుంటపల్లె సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఏపీవో దినకర్‌బాబు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజులు పనులు కల్పిస్తామన్నారు. 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుల పొలంలో మునగ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి మొక్కలు నాటుకోవచ్చునని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సోమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిల్వలను గుర్తించకుండా ద్విచక్రవాహనాన్ని వేగంగా నడిపి అదుపు తప్పి పడిపోవడంతో ఓ యుకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమల-నంజంపేట ప్రధాన రహదారిలోని అడుసుపల్లె వద్ద శుక్రవారం శీలయ్యగారిపల్లెకు చెందిన మునీశ్ ద్విచక్రవాహనంలో వేగంగా పోతూ గుంతలను గుర్తించక పోవడంతో అదుపు తప్పి పడిపోయాడు. గాయపడ్డ యువకుడికి స్థానికులు వైద్యశాలలో చికిత్సలు కల్పించారు.

నేడు గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సోమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ చిన్నసోమల పాఠశాల వద్ద శనివారం నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు దాతల చేయూతతో నిర్మించిన ఆలయంలో గోపూజ, గంగపూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం, రక్షాబంధనం, అంకురార్పణ, కలశారాధన, వాస్తు పూజ, విగ్రహ ఊరేగింపు, ఆదివారం కలశపూజ, మహాగణపతి హోమ, కళాహోమం, మూర్తి హోమం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పలమనేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సౌత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సామాజిక కార్యకర్తలు మధుమోహన్‌రావు, సుకన్య, బి.శిరీష నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేవతి, పాఠశాల ఉపాధ్యాయులు కళావతి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

గాయపడ్డ యువకుడి మృతి



రవితేజ (ఫైల్‌ఫొటో)

చౌడేపల్లె,నవంబరు22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు గురువారం మృతి చెందాడు. గాజులవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు రవితేజ(20) అక్టోబరు 28న ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్ళి వస్తూ బోయకొండ సమీపంలో బోల్తాపడ్డాడు.ఈ ప్రమాదంలో రవితేజకు తీవ్రగాయాలు కావడంతో తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈవో ఏకాంబరం అన్నదానాన్ని పర్యవేక్షించారు. పలమనేరుకు చెందిన నవీన్‌కుమార్ మిత్రబృందం నిత్యాన్నదానానికి కూరగాయలు ఉచితంగా సరఫరా చేశారు.

వైష్ణవీదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు.

ఉన్నత పాఠశాలల పనివేళలు మార్చొద్దు

కుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పనివేళలను మార్చాలనే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పోతుగుంట చిట్టిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచుతూ నిర్ణయించి, అమలుకు ఉత్తర్వులు కూడా ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పాఠశాలల పనివేళల మార్పు పిల్లల మానసిక స్థితిపై వ్యతిరేక ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలపైన సరైన రవాణా సౌకర్యం లేక, బాలికలకు భద్రతా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి, పాఠశాల పనివేళలు యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

టీడీపీతోనే బ్రాహ్మణుల సంక్షేమం

రామకుప్పం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కుప్పం మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి తెలిపారు. శుక్రవారం ఆయన రామకుప్పంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధి కమిటీల్లో బ్రాహ్మణులకు సభ్యత్వం కల్పించేలా సవరించిన దేవదాయ శాఖ బిల్లును గురువారం శాసనసభలో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను మెప్పించిన చిత్తూరు ఎమ్మెల్యే


సీఎం చంద్రబాబుకు వినతిపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మొదటిసారి అసెంబ్లీకి వెళ్లినా.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీఎం నారా చంద్రబాబును, నియోజకవర్గ ప్రజలను మెప్పించారు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్. అలాగే సీఎంను, సంబంధిత శాఖల మంత్రులను ప్రత్యేకంగా కలవడం, వినతిపత్రాలు ఇవ్వడం ద్వారా నిధుల మంజూరుకు ప్రయత్నాలు చేశారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన అడవిపల్లె రిజర్వాయర్ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులు మళ్లీ పట్టాలెక్కాయి. ఉచిత డీఎస్సీ కేంద్రం ఏర్పాటైంది. గుడిపాలలో పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్, చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి ఆధునిక అంబులెన్స్‌లు, అడవిపల్లె రిజర్వాయర్ పైప్ లైన్ కోసం అదనంగా మరో రూ.70 కోట్లు, నగర సమగ్రాభివృద్ధికి రూ.350 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు ఇచ్చారు.

అసెంబ్లీ సమావేశాలు సంతృప్తినిచ్చాయి: జగన్మోహన్

చిత్తూరు ఎమ్మెల్యేగా తొలిసారి శాసనసభ సమావేశాల్లోపాల్గొనడం, సభా వేదికగా నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే జగన్మోహన్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

బకాయిదారులకు రెడ్ నోటీసు జారీ చేయాలి: డీఎంఏ

చిత్తూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అనంతపురం డీఎంఏ విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. దీర్ఘకాలంగా పన్నులను పెండింగ్ పెట్టిన బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. షాపింగ్ కాంప్లెక్సులు, విద్యా సంస్థలు, లాడ్జిలు, కళ్యాణ మండపాలు, ప్రభుత్వ భవనాలకు సంబంధించిన పన్నులను వసూలు చేయాలని చెప్పారు. రానున్న 120 రోజులు ఎంతో కీలకమని, లక్ష్యాలను నిర్దేశించుకుని బృందాలుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహ ప్రసాద్ కూడా రెవెన్యూ అధికారులతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఏసీ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఆర్వో వర్మ, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్ నరసింహ ప్రసాద్, అధికారులు

'తేనె మంచు'ను నివారిస్తే మామిడిలో అధిక దిగుబడి


రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో 'తేనెమంచు'ను రైతులు నివారించుకుంటే అధిక దిగుబడి సాధ్యమవుతుందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాంపల్లె వద్ద ఉన్న ఎన్వీ సావిత్రమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం మామిడి రైతులకు పంటపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెగుళ్ల నివారణతోపాటు మంచి దిగుబడి కోసం కాయలకు కవర్లు కట్టాలన్నారు. సర్పంచ్ స్వర్ణ, ఉద్యాన శాఖ అధికారి సాగరిక, రైతులు సీతాపతినాయుడు, యబ్బూరి వేణుగోపాల్, ధనంజయరాయుడు, సురేంద్రనాయుడు, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను ఆదుకోవాలి

- ఆలిండియన్ ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆలిండియన్ ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ (న్యూఢిల్లీ సౌత్ జోన్ చైర్మన్), జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య కార్యదర్శి కట్టమంచి గోవర్ధన్ బాబి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక మ్యాంగో భవన్‌లో మీడియాతో మాట్లాడారు. యుద్ధాల ప్రభావం.. జిల్లాలో ఉత్పత్తి చేసే మామిడి గుజ్జు ఎగుమతులపై పడిందన్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా 2.75 లక్షల టన్నుల మామిడి ఉత్పత్తులు ఎగుమతులకు నోచుకోలేదని చెప్పారు. దీనివల్ల బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు, కార్మికుల జీతాలు, రైతుల ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించలేక పరిశ్రమలు మూతబడే పరిస్థితి వస్తోందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు శివకుమార్, షమీర్, రమేష్, శ్రీధర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న గోవర్ధన్ బాబి

వైసీపీ నాయకుడి కబ్జాకు 'రెవెన్యూ' కళ్లెం?

- ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు

వెదురుకుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి భూ కబ్జాకు 'రెవెన్యూ' కళ్లెం వేసింది. కార్వేటినగరం మండలం టీకేఎంపేట గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-70లోని దేవరగుట్టలో రెండెకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు ఓ వైసీపీ నాయకుడు ఉపక్రమించాడు. ఎక్స్‌కవేటర్లతో భూమిని చదునుచేశాడు. సమాచారం తెలుసుకున్న కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు, ఉపతహసీల్దార్ త్యాగరాజు ఆదేశాలతో వీఆర్వో చంద్రయ్య, సర్వేయరు అశోక్ అక్కడికి వెళ్లారు. ఆక్రమణ నిజమేనని నిర్ధారించారు. తహసీల్దార్ ఆదేశాలతో ఆ భూమిలో ఇది ప్రభుత్వ భూమి ఎవరైనా ప్రవేశిస్తే చట్టరీత్యా శిక్షార్హులని అంటూ శుక్రవారం బోర్డు పెట్టారు. అలాగే వైసీపీ నాయకుడికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. మళ్లీ ఆ భూమిలో ప్రవేశిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పనులు ఆపించి.. ప్రభుత్వ స్థలం అంటూ బోర్డు పెట్టిన వీఆర్వో చంద్రయ్య, సర్వేయర్ అశోక్

ఈ భవనాన్ని పట్టించుకునే వారేరి?

జడ్పీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో పెరిగిన ముళ్లకంపలు
విష పురుగులు చేరడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు



చిత్తూరు కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరం నడి బొడ్డున వేలూరు హైవే రోడ్డు ఆనుకుని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా దాదాపు 12 ఏళ్లుగా శిథిలమై ముళ్లకంపల మధ్య మోడు బోయిన జడ్పీ గెస్ట్‌హౌస్ చూపరులకు దీనంగా కనిపిస్తున్నది. 2012 నుంచి ఇది మూతపడగా.. అప్పటి నుంచి పట్టించుకునే నాథుడు కరవయ్యారు. 2014-19లో అప్పటి జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి ఒకానొక సందర్భంలో పాత గెస్ట్‌హౌస్‌ను పూర్తిగా కూల్చి దాని స్థానంలోనే కొత్త భవనం నిర్మించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తర్వాత ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. ప్రస్తుతం ఇక్కడ ముళ్లకంపలు పెరిగి.. పాములు, విషపు పురుగులు చేరాయి. వీటివల్ల పరిసర ప్రాంతాల ప్రజలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై జిల్లా పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంతపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. తేనెబండ, కొత్తూరు, గంగాకాలనీ, శ్రీనివాసపురం ప్రాంతాల్లో ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం


చిత్తూరు కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాములగుడి వీధి జైన్ ప్రార్థనామందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో తిరుపతి అరవింద నేత్రవైద్యశాల వైద్యుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటినుంచి ఓటర్ల నమోదు

వెదురుకుప్పం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో శని,ఆదివారాల్లో ఓటర్ల నమోదు, తొలగింపునకు దరఖాస్తులను స్వీకరిస్తామని తహసీల్దార్ నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు ఉంటారన్నారు.

భయం.. భయంగా..!

పెచ్చులూడుతున్న పైకప్పు
ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం



వెదురుకుప్పం మండలం పూలవారికండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పెచ్చులూడుతోంది. ఇక్కడ పాఠశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాన్నీ నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడేమి జరుగుతుందోనని చిన్నారులు భయం.. భయంగా విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది.
- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి


వరండాలో పెచ్చులూడిన పైకప్పు కిందే అంగన్వాడీ చిన్నారులతో కార్యకర్త యువరాణి

అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడం వల్లే..

అంగన్వాడీ కేంద్రానికి సొంత భవన వసతి లేకపోవడం వల్లే ఈ పాఠశాల వరండాలో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రానికి వచ్చే వంట సరుకులు, ఇతర సామగ్రిని పెట్టుకోవడానికి కూడా వసతి లేక అంగన్వాడీ నిర్వాహకురాలు యువరాణి ఇంట్లో దాచారు. ఆ ఇంటి నుంచే మధ్యాహ్న భోజనం తీసుకొస్తారు. వరండాలో కూడా పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. ఎందుకంటే వరండా పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం వస్తే ఇక పిల్లల పరిస్థితి అంచనా వేయవచ్చు. ప్రమాదం జరగకముందే పిల్లలకు తగిన వసతి ఉన్న చోట అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తే మంచిదని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఉరుస్తున్న తరగతి గది

ప్రాథమిక పాఠశాలకు ఒకే గది ఉంది. ఇక్కడే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ గదిలోనూ పైకప్పు పెచ్చులూడి పడుతోంది. వర్షం వస్తే ఉరుస్తోంది. ఐదు తరగతులకు ఏడుగురు విద్యార్థులు ఉండటంతో ఏకోపాధ్యాయుడు హరిబాబుతో పాఠశాల నిర్వహిస్తున్నారు.

వైసీపీ హయాంలో పనిచేసిన వ్యక్తే విచారణాధికారా?

- కూటమి నేతలు ప్రశ్నించడంతో వెనుదిరిగిన అధికారులు


విచారణ అధికారులను ప్రశ్నిస్తున్న కూటమి నాయకులు

పెనుమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పెనుమూరు వెలుగు ఏపీఎంగా పనిచేసిన వ్యక్తినే మహిళా మార్టుపై విచారణ అధికారిగా ఎలా నియమిస్తారు అని స్థానిక కూటమి నేతలు ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా మార్టుల్లో గత ప్రభుత్వంలో జరిగిన లావాదేవీలపై విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పెనుమూరులోని మహిళా మార్టుపై విచారణకు వచ్చిన అధికారులతో స్థానిక నాయకులు వాగ్వాదానికి దిగారు. మార్టును నడిపించిన ముందున్న ఏపీఎం హరికృష్ణారెడ్డి, ఆయనతోపాటు జగన్నే మళ్లీ సీఎం చేయాలని జిల్లా మొత్తం తిరిగి మహిళలతో తీర్మానం చేసిన సుధాకర్‌లు ఎలా విచారణకు వస్తారని నిలదీశారు. దీంతో విచారణాధికారులు వెనుదిరిగారు.

అవకతవకలు జరిగాయన్న నేతలు

కూటమి నాయకులు మాట్లాడుతూ.. ప్రతి మహిళా నెలకు రూ.వెయ్యి సరుకులు కొనాలని నిబంధన పెట్టి.. కోట్ల లావాదేవీలు నడిపి ప్రభుత్వం మారాక మహిళా మార్టు నష్టాల్లో ఉందని లెక్కలు చూపిన వ్యక్తే విచారణ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రూపు సభ్యులతో రూ.27లక్షలు, శ్రీనిధి నుంచి రూ.20లక్షలు తీసుకుని మార్టును ప్రారంభించారని చెప్పారు. వచ్చిన లాభాల్లో ప్రతి సభ్యురాలికీ వాటా పంచుతామని చెప్పి.. చివరకు నష్టాలు చూపిస్తే ఊరుకోమని చెప్పారు. ఈ విషయంపై ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ రవికుమార్‌నాయుడికి కూడా కూటమి నాయకులు ఫిర్యాదు చేశారు. మహిళా మార్టులో అవకతవకలు జరిగాయని.. నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు.

అంగన్వాడీ స్థలంపై కన్నేసిన వైసీపీ కార్యకర్త

కృష్ణజిమ్మాపురంవాసుల ఆవేదన


కృష్ణజిమ్మాపురంలోని అంగన్వాడీ భవనం

పాలసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురంలో అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలంపై ఓ వైసీపీ కార్యకర్త కన్నేశాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణజిమ్మాపురంలో 2019లో టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామానికి చెందిన లోకనాథరెడ్డి ఐదు సెంట్ల స్థలాన్ని అంగన్వాడీ కేంద్రానికి ఇచ్చారు. మూడు సెంట్లలో భవనం నిర్మించి, రెండు సెంట్ల స్థలంలో పిల్లలు ఆడుకునేందుకు వినియోగిస్తున్నారు. శుక్రవారం అంగన్వాడీ కేంద్రానికి చెందిన స్థలాన్ని చదును చేసి మరుగుదొడ్లు నిర్మించడానికి సర్పంచ్ భానుప్రియ పునాదులు తీయడానికి ప్రయత్నించగా.. అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త హేమంత్ అడ్డుకున్నాడు. ఈ స్థలాన్ని 2022లో తాను రిజిస్టర్ చేసుకున్నానని చెప్పాడు. దీనిపై తహసీల్దార్‌కు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. అంగన్వాడీకి కేటాయించిన స్థలాన్ని ఎలా రిజిస్టర్ చేసుకున్నాడో అధికారులు విచారించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైన్స్ మ్యూజియంలో పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ మ్యూజియంలో రూ.12 లక్షలతో చేపట్టిన సివిల్ వర్క్‌లను శుక్రవారం సమగ్రశిక్ష ఈఈ బాల సుబ్బారావు, డీఈ మధుసూదన్ సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏఈ మునిరత్నం, కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరలో మ్యూజియం ప్రారంభం కానున్న క్రమంలో పాత, ఇతర వర్కులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

ప్రమాదాలకు నిలయంగా వంక కల్వర్టు

తవణంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జొన్నగురకల గ్రామ సమీపంలో ఉన్న గొడ్డు వంకపై ప్రజలు రాకపోకల నిమిత్తం తూములు లేని కల్వర్టు నిర్మించారు. రెండు నెలల నుంచి ఈ వంకలో నీరు ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై పాచి కట్టి జారి పడుతున్నారు. ప్రధానంగా.. అరగొండ, బంగారుపాళ్యం వైపు ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు జారిపడి తీవ్రంగా గాయపడుతున్నారు. కల్వర్టు సమీపంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతోపాటు ఇక్కడ తూములు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.


గొడ్డు వంక కల్వర్టుపై పట్టిన పాచి, ప్రవహిస్తున్న నీరు

వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు



చిత్తూరు కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మగుడి వీధిలోని వీరాంజనేయ స్వామి ఆలయ కుంభాభిషేక వార్షికోత్సవ పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో చిత్తూరు ఎమ్మెల్యే తల్లిదండ్రులు చెన్నకేశవులు నాయుడు దంపతులు, ఆలయ అర్చకుడు సుధాకర్ గురుకుల్, ఈవో తిమ్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబాకు పల్లకీసేవ: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో జరుగుతున్న సత్యసాయిబాబా జయంతి వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పల్లకిసేవ నిర్వహించారు.

పనివేళల పెంపు నిర్ణయం సరికాదు: ఎస్టీయూ


సభ్యత్వ నమోదు పత్రాలతో హేమచంద్రారెడ్డి తదితరులు

వెదురుకుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పని వేళల పెంపు నిర్ణయం సరికాదని, ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదుపై వాకబు చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి తన్నీరు యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును బాగుచేయండి



గుడిపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నంగమంగళం పంచాయతీ వేల్‌రామ్‌బట్టికి పోయే రహదారి కొద్దిపాటి వర్షానికే గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయం అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రహదారిలోని రోడ్డుకు కంకరపోసి వదిలేయడంతో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఇకనైనా సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షం వస్తే బురద దారే గతి



ఐరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే బురద దారే గత్యంతరం అవుతోందని గాజులపల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామం నుంచి మెయిన్ రోడ్డుకు రావడానికి సుమారు కిలోమీటర్‌కుపైగా ఈ మార్గం ద్వారానే రావాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని గ్రాసమ్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం

- జ్వరాల బారిన జనం

శ్రీరంగరాజపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామ పంచాయతీ పొదలపల్లెలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. పరిసరాలన్నీ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. అలాగే గంగమ్మగుడి గ్రామంలో ఆరిమాని గంగమ్మ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. సమీపంలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి సమీపంలోని కాలువలో మురుగు స్తంభించి దోమలకు నిలయంగా మారింది. పైగా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికితోడు వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా జనం జ్వరాల బారినపడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పొదలపల్లెలో రోడ్డుపై పారుతున్న మురుగు - గంగమ్మగుడి వద్ద కాలువలో స్తంభించిన మురుగు

సంక్షిప్తంగా..

ఏఆర్ డీఎస్పీగా చిన్నికృష్ణ

చిత్తూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా డీఎస్పీగా ఉన్న చిన్నికృష్ణను మన జిల్లాకు ఏఆర్ డీఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ డీఎస్పీగా ఉన్న ఇలియాస్ బాష ఏఎస్పీగా పదోన్నతి పొంది అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన రెండ్రోజుల్లో బాధ్యతలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

ఆరోగ్య సూత్రాలను పాటించండి

గుడిపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సూత్రాలను పాటించాలని గుడిపాల వైద్యాధికారి సంధ్య అన్నారు. శుక్రవారం రామభద్రాపురంలో హెల్త్‌క్యాంపును నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్, ఎస్‌వో జార్జి, డీపీవో రామ్మోహన్, మంజునాథ్, డాక్టర్ చంద్రమహేష్, విజయ, చంద్రశేఖర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేయండి'

బంగారుపాళ్యం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా జరిగే సభను విజయవంతం చేద్దామని మండల దళిత నేతలు సతీష్, శెల్వకుమార్, హేమాద్రి, దేవయ్య, సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శనివారం పలమనేరు పట్టణంలోని జెండా మఠం మహల్‌లో సభ జరుగుతుందన్నారు. మండలంలోని ఎస్సీలంతా హాజరవ్వాలని కోరారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డికి చెందిన ప్రసాద్ శుక్రవారం రూ.1,00,001 విరాళంగా అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ జాబ్ కార్డులు

వెదురుకుప్పం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలందరికీ జాబ్‌కార్డులు తప్పనిసరిగా ఉండాలని కార్వేటినగరం ఎంపీడీవో టి.చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం కార్వేటినగరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాబ్ కార్డుల పునః పరిశీలనకు గ్రామసభ జరిగింది. దరఖాస్తు చేసుకుంటే కొత్త జాబ్ కార్డులు ఇస్తామన్నారు.

రగ్గుల వితరణ



పాలసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆముదాల పంచాయతీ జయలక్ష్మీపురం ఎస్టీకాలనీవాసులకు రగ్గులను జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ శుక్రవారం వితరణ చేశారు. నాయకులు రాఘవ, స్రవంతి, రూపేష్‌రాజు,అన్నామలై, సురేష్‌రెడ్డి, కోదండన్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఎస్పీ మణికంఠ



తవణంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని ఎస్పీ మణికంఠ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

800 లీటర్ల సారా ఊట ధ్వంసం

గుడిపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగరాళ్లపల్లె పరిసరప్రాంతాల్లో శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో సుమారు 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.